'సంభాషణ'



# రాజ్యాంగబద్ధమైన కర్తవ్యాలను ప్రభుత్వమే విస్మరిస్తోంది

## ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. బాలగోపాల్ తో ఇంటర్వ్యూ

ప్రశ్న : అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ (అంతర్జాతీయ క్షమాభిక్ష సంఘం) సంస్థకు ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ అనుబంధంగా వ్యవహరిస్తుందా?

జవాబు : అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ సంస్థకు అనుబంధంగా ఎ.పి.సి.ఎల్.సి. (పౌరహక్కుల సంఘం) వ్యవహరించడం లేదు. ఆ సంస్థకు భారతదేశంలోనూ సభ్యులున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న అత్యాచారాల్ని వారికి తెలియ పరుస్తుంటాం. వాటిపై ఆ సంస్థ స్పందించి ప్రభుత్వానికి తెలియపరచడం జరుగుతుంది. ఒక్క యూరప్ లో మాత్రం సంఘటితంగా ఈ సంస్థ కార్యక్రమాలు జరిగిపోతున్నాయి. ఇతరదేశాల్లో ఎక్కువగా పౌరహక్కుల సంఘాలపైనే ఈ సంస్థ ఆధారపడుతుంది.

ప్రశ్న : అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ సంస్థ ఆశయాలకూ, ఆచరణకూ, పౌరహక్కుల సంఘం ఆచారణ ఆశయాలకూ మధ్యవ్యత్యాసాలేమైనా వున్నాయా?

జవాబు : అవగాహనలో తేడాలేదు. తీసుకొనే నిర్ణయాలు, పనిచేసే పద్ధతుల్లో తేడా వుంది. అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ సంస్థ రాజకీయ అభిప్రాయాల కారణంగా ఖైదీ చేయబడ్డవారిని విడుదల చేయడానికి, పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా అలజడి చేయడం, అంతర్జాతీయ మానవ హక్కులు హరించే చట్టాలు రూపొందిస్తే వాటికి నిరసన వ్యక్తం చేయడం జరుగుతుంది. పౌరహక్కుల సంఘం పైకార్యక్రమాల్ని చేపడుతుంది. సంఘంలో బలవంతులు బలహీనులపై చేసే దాడుల్ని ప్రతిఘటిస్తుంది. అమ్నెస్టీ మాత్రం ప్రభుత్వ చర్యలకే పరిమితి అవుతుంది. అమ్నెస్టీ కన్నా పౌరహక్కుల సంఘం కార్యక్రమాలు ఎక్కువ. బహిరంగసభలు, కరపత్రాలతో విస్తృత ప్రచారం చేస్తాయి. అమ్నెస్టీ సంస్థకు పౌరహక్కుల సంఘానికి మౌలిక అభిప్రాయ భేదాలు లేవు.

ప్రశ్న : పౌరహక్కుల సంఘానికి విభిన్న రాజకీయాభిప్రాయాలు కలిగిన నాయకుల, కార్యకర్తల, సానుభూతిపరుల నుండి తగిన స్పందన లభిస్తుందా?

జవాబు : పాలక పార్టీల నుండి ఎలాగూ స్పందన లభించదు. ప్రతిపక్షాల నుండి మేము ఆశించేంత స్పందన రావడంలేదు. రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు మినహా మిగిలిన కార్యకర్తల, ప్రజల సానుభూతి, స్పందన కనిపిస్తుంది.

ప్రశ్న : ఆంధ్రప్రదేశ్ లో తీవ్రవాద రాజకీయాలు సిద్ధాంత బద్ధంగా, ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నట్లు మీరు భావిస్తున్నారా?

జవాబు : పౌరహక్కుల సంఘం ఎవ్వరికీ సర్టిఫికేట్ ఇవ్వదు.

ప్రశ్న : ఒకప్పుడు లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆశీర్వాదబలంతో జాతీయ స్థాయిలో ఆవిర్భవించి, అత్యవసర పరిస్థితి కాలంలో గణనీయంగా కృషిచేసిన పౌరహక్కుల సంఘం ఆనాడు ప్రజల్లో గుర్తింపు పొంది గౌరవింపబడింది. అలాంటిది నేడు తనకు తానుగా తన పరిధిని కుంచించుకొని సమాజంలోని కొన్ని వర్గాలకు మాత్రమే తమ సేవలు అందిస్తుందన్న అపప్రధవుంది దానిపై మీ అభిప్రాయం?

జవాబు : అపప్రధకాదు. అపోహ మాత్రమే. పౌరహక్కుల సంఘం ఉద్యమం కేవలం జయప్రకాష్ నారాయణ్ తో మొదలైంది కాదు. ఆయన తనవంతు కృషిగా తనకు పరిచయమున్న న్యాయవాదుల్ని న్యాయమూర్తుల్ని, కదిలించి పి.యు.సి.ఎల్. ఏర్పాటుకు దోహదం చేసారు. అయితే ఆంధ్రప్రదేశ్ లో ఎ.పి.సి.ఎల్.సి., పశ్చిమ బెంగాల్ అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్, ఈ రెండు సంస్థలు పి.యు.సి.ఎల్. కన్నా ముందుగా ఆవిర్భవించాయి. అనాటికన్నా ఈనాడు అన్ని పౌరహక్కుల సంఘాలు మరింత విస్తృతపరిధిలో పనిచేస్తున్నాయి. ముఖ్యంగా లాకప్ మరణాలు, గ్రామాల్లో దళితులపై అత్యాచారాలు, వరకట్నపు హత్యలు, వాతావరణ కాలుష్యం మొదలైన అనేక కొత్త విషయాలపై గత కొన్ని సంవత్సరాలుగా పౌరహక్కుల సంఘాలు పనిచేస్తున్నాయి. పౌరహక్కుల ఉద్యమం ఎప్పుడైనాసరే సమాజంలో ఎవరైతే బలహీనంగా వుంటారో, లేదా ప్రభుత్వం ఎవరినైతే బలవంతంగా నిర్బంధిస్తుందో వారికి సహాయం అందిస్తుంది. దానిని కొన్ని వర్గాలకు మాత్రమే సేవలు అందివ్వడం అని అనదలచుకుంటే అనవచ్చు. అందులో తప్పేమిలేదు.





ప్రశ్న : విద్యార్థులు తీవ్రవాదం రాజకీయాల్లో తలమునకలుగా పనిచేస్తుండటాన్ని మీరు సమర్థిస్తున్నారా?

జవాబు : ఎవరికైనా ఏ రాజకీయాలైనా ఎంచుకునే హక్కు వుంటుంది. ఒక్క రాజకీయాల్లో పనిచేయడమే నేరంకాదు. పని చేసే క్రమంలో ఏవైనా నేరాలు చేస్తే చట్ట ప్రకారం శిక్షించవద్దని మేము అనలేదు. కానీ ఒక్క రాజకీయాన్నే నేరంగా పరిగణించడానికి వీలులేదు.

ప్రశ్న : కారంచేడు, పదిరికుప్పం, నీరుకొండ, దొంతలి లాంటి దుస్సంఘటనలు పునరావృతం కాకుండా వుండేందుకు పౌరహక్కుల సంఘం ప్రజలకు ప్రత్యేకించి ప్రభుత్వానికి అందించే నిర్మాణాత్మకమైన సూచనలేమైనా వున్నాయా?

జవాబు : ప్రభుత్వానికి ప్రత్యేకంగా సూచనలేమీ ఇవ్వడంలేదు. ఎందుకంటే ఇలాంటి దమనకాండలు ప్రభుత్వ విధానాల వైఫల్యం నుండే పుట్టాయి. భూసంస్కరణలు సక్రమంగా అమలు పరచి, గ్రామాల్లో ఏ కొద్ది మంది అభివృద్ధోకాక మొత్తం గ్రామాభివృద్ధి పంథాను ప్రభుత్వం రూపొందించి, అంటరానితనం లాంటి దురాచారాల్ని అరికట్టి వుంటే ఇలాంటి సంఘటనలు తలెత్తేవికావు. ప్రజలకు ఇచ్చే సూచనలు మాత్రం రెండు. అన్నిదాడులు గ్రామంలోని పెత్తందార్లు తమ కులాలకు చెందిన సామాన్య ప్రజానీకాన్ని సమీకరించి దళితవర్గాలపై దాడులు చేస్తున్నారు. ఈ సామాన్య ప్రజానీకం కులం అనే తప్పుడు చైతన్యం ఫలితంగా ఈ దాడుల్లో పాల్గొంటున్నారు. ఆ తప్పుడు చైతన్యం విడనాడి గ్రామాల్లోని సామాన్య ప్రజానీకం అంతా పెత్తందార్లకు వ్యతిరేకంగా నిలిచిన ఈ దాడులు పూర్తిగా ఆగిపోతాయి. ఆ వైపుగా కృషి చెయ్యవలసిన అవసరం వుందని ప్రజలకు, ప్రజాస్వామ్య కార్యకర్తలకు ఇచ్చే సలహా.

ప్రశ్న : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రిజర్వేషన్ల విధానం కారణంగా అగ్రవర్ణాల్లోని మధ్యతరగతి, నిరుపేద ప్రజల్లో క్రమేపీ వృద్ధి చెందుతున్న అసహనం ఎలా తొలగింపబడాలని మీరు భావిస్తున్నారు?

జవాబు : నిరుద్యోగానికి రిజర్వేషన్లు కారణం అన్న భ్రమ అగ్రవర్ణాలలోని మధ్యతరగతి నిరుపేద ప్రజలు పోగొట్టుకోవడం అవసరం. వుద్యోగ అవకాశాలు కలగనంతకాలం ఎవరిలో వొకరిలో అసహనం వుండక తప్పదు. ప్రభుత్వం తన విధానాల ద్వారా అందరికీ వుద్యోగాలు కల్పించడం నిజమైన పరిష్కారమవుతుంది. అందుకోసం అందరూ సంఘటితంగా కృషి చెయ్యాలే తప్ప, రిజర్వేషన్ల వల్ల తమకు వుద్యోగాలు పోతున్నాయనే తప్పుడు ఆలోచనతో వెనుకబడిన కులాలపై దాడులు చేయడం అన్యాయం.

ప్రశ్న : ప్రస్తుత ఎన్నికల విధానంలోని లొసుగులు, ఆచరణలో ఎదురౌతున్న సమస్యలు, ఎన్నికలపై ఇతర శక్తులు పడి పౌరులు కోల్పోతున్న వోటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవడానికి మీ యొక్క సూచన లేంటి?

జవాబు : రాబోయే కాలంలో ఎన్నికల్లో హింసాకాండ ప్రబలుతుందని, పేద ప్రజలు తమ వోటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి మరింత పెరుగు తుందని మేము భావిస్తున్నాము. ఇప్పటికే గత నాలుగేళ్లలో మన రాష్ట్రంలో జరిగిన ప్రతి ఎన్నికల్లోను విపరీతమైన హింసాకాండ జరిగింది. రిగ్గింగ్ చేయడం, దొంగ ఓట్లు వేయడం చాలా ఎక్కువ అయిపోయింది. ఇందులో మంత్రులే ప్రత్యక్ష్యంగా పాల్గొంటున్నారు. సమాజంలో రాజకీయ, ఆర్థిక అసమానతలు పోనంతకాలం ఈ పరిస్థితి మెరుగుపడే అవకాశం లేదు.

ప్రశ్న : పౌర హక్కుల సంఘం నాయకులు డా. రామనాధం హత్యకేసు పురోగతి ఎలా వుంది? నిందితులు శిక్షింపబడ్డారా?

జవాబు : డాక్టర్ రామనాధం హత్యకేసులో ఎవరిపై కేసు పెట్టలేదు. విచారణ జరగలేదు. నిందితులు శిక్షింపబడే ప్రసక్తే లేదు.

ప్రశ్న : ప్రభుత్వ నిర్లిప్తత, తీవ్రవాదుల ఉద్ధృత చర్యల మధ్య నలిగి తమ స్వేచ్ఛను కోల్పోతున్న సామాన్య ప్రజల సమస్యకు పౌర హక్కుల సంఘం ఎలాంటి వూరడింపు నందిస్తుంది? ప్రభుత్వానికి, తీవ్రవాదులకు మీ పౌర హక్కుల సంఘం ఏవైనా సూచనలు అందజేసిందా?

జవాబు : నక్సలైట్లను ప్రభుత్వంతో సమానంగా చూసి ఇద్దరి మధ్య ప్రజలు నలిగిపోతున్నారని అనుకోవడం మా అవగాహనకాదు. ఇది నిజానికి పోలీసు అత్యాచారాల్ని కాదనలేక, వాటిని ఖండించడం ఇష్టంలేక కొన్ని పత్రికలు, కొంతమంది మేధావులు కల్పిస్తున్న వాదన. మేము రాజకీయ పార్టీలకు సూచనలు అందజేయం. ప్రభుత్వానికి మటుకు తన విద్యుక్త ధర్మాన్ని ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాము. ప్రభుత్వం తన రాజ్యాంగ బద్ధమైన కర్తవ్యాలను తప్పనిసరిగా నిర్వర్తించాలి. దానికి వేరే వాళ్ళ ప్రవర్తనతో నిమిత్తం వుండటానికి వీలులేదు. ఈ విషయంలో మనరాష్ట్రంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందింది. భూసంస్కరణ చట్టాలను, గిరిజనుల భూమి బదలాయింపు నిషేధ చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. పోలీసుల అత్యాచారాలు హెచ్చుమీరి పోతున్నాయి. గత 20 ఏళ్లుగా మన రాష్ట్రంలో 650 మందిని "ఎన్ కౌంటర్"లలో కాల్చివేసారు. వందల కొలది గిరిజన గ్రామాల్ని తగలబెట్టారు. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే రెండు, మూడు వేల ఇళ్ళను నేలమట్టం చేసారు. కొన్నివేల మందిని అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి, తప్పుడు కేసుల్లో ఇరికించారు. ఈ మధ్యకాలంలో టెర్రరిస్టు చట్టం (టాడా) చాలా విస్తృతంగా దుర్వినియోగం చేయడం జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా వెనక్కు తీసుకొని చట్టబద్ధంగా వ్యవహరించాలని, ప్రజల గౌరవాన్ని పొందాలని, అప్పుడే తాము కోరుకునే పరిష్కారం సాధ్యమవుతుందని మేము భావిస్తున్నాము.

ప్రశ్న : రాష్ట్ర పౌర హక్కుల సంఘం ఎన్ని ప్రముఖమైన కేసుల్ని స్వీకరించింది. ఆ కేసులకు ఎంతవరకు పరిపూర్ణ న్యాయం చేసింది?

జవాబు : పౌర హక్కుల సంఘం కోర్టులో చాలా కేసులు వేసింది. కానీ పరిపూర్ణ న్యాయం ఏ కోర్టులోను సాధించలేదు. ఎన్ కౌంటర్లపై రెండుసార్లు సుప్రీంకోర్టులో కేసు వేసాం. కల్లోలిత ప్రాంతాల చట్టాలు రద్దు పరచాలని సుప్రీంకోర్టులో కేసు వేసాం. పోలీసు కస్టడీలో నుండి మాయమైన వ్యక్తుల ఆచూకీ తెలియజేయాలని హైకోర్టులో కేసు వేసాం. చిత్తూరు జిల్లా అడవి ఏనుగుల సమస్య గురించి హైకోర్టులో కేసు వేసాం. వాతావరణ కాలుష్యంపై కేసు వేసాం. కోర్టు కేసులు మాత్రమేకాక లాకప్ మరణాలు, వరకట్న హత్యలు, దళితులపై అత్యాచారాలు, మొదలైన అసంఖ్యాకమైన కేసుల్ని పౌర హక్కుల సంఘం టేకప్ చేసి ప్రచారం చేయడం, ప్రభుత్వంపై వత్తిడి తీసుకొని రావడం, బాధితులకు ధైర్యం చెప్పడం జరిగింది.

ఇంటర్వ్యూ :
**జలదంకి ప్రభాకరరావు**
నెల్లూరు